# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం 21 డిసెంబర్ 2024 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 12


ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో మరో కీలక పరిణామం



2



# అధికారుల అండదండలతో..
# అక్రమ నిర్మాణాలు

**ఆల్వాల్ సర్కిల్ పరిధిలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న భూ యజమానులు**

**అక్రమ నిర్మాణాల వెనుక బడా నాయకుల పేర్లు**

**కనిపించని జీహెచ్ఎంసీ విజిలెన్స్ అధికారులు**

**అల్వాల్, డిసెంబర్ 20 (నినాదం న్యూస్):** అల్వాల్ సర్కిల్ పరిధిలో అక్రమ కట్టదాలకు అడ్డు.. అదుపు లేకుండాపోయింది. ఈ అక్రమ కట్టడాలు, దాదాపు నాయకులు, జి.హెచ్.ఎం.సి., అధికారుల అండదండలతోనే అంటూ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జి.హెచ్.ఎం.సి. నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా సెల్లార్‌లు, పెంట్ హౌస్‌లు, షెడ్లు వంటి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల మౌనం వెనుక మతలబు ఏమిటని ప్రజలు వాపోతున్నారు. బిల్డింగ్ నిర్మాణ అనుమతుల కొరకు దరఖాస్తు చేసి అనుమతి రాకముందే నిర్మాణాలను ప్రారంభిస్తుండటం విడ్డురంగా ఉందని, పిర్యాదులు చేసినా చలనం లేని అధికారులు, అప్పుడప్పుడు తుతూ మంత్రంగా నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని నిర్మాణాలను స్థానికుల ఒత్తిడి మేరకు పాక్షికంగా కూల్చిన వెంటనే తిరిగి నిర్మాణాలను కొనసాగిస్తున్నారన్నారు. అధికారులనుండి అనుమతులు రాకుండానే నిర్మాణాలు ప్రారంభించడం ఏమిటని స్థానికులు అధికారులను నిలదీస్తే వారికి నాయకుల అండదండలు ఉన్నాయని బాహటంగా అధికారులే చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. అంతేకాదు వారు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారని అధికారులే వాకాల్తా పుచ్చుకోవడం చూస్తే అధికారులు ఆమ్యామ్యాలా మత్తులో జోగుతున్నారని ప్రజలు గుసగుసలాడుతున్నారు. అల్వాల్ సర్కిల్ మచ్చబోల్లారం, అల్వాల్ డివిజన్ లక్ష్మి కలామందిర్ వద్ద షెడ్, వెంకటారం ఇంద్రానగర్‌లో నిర్మిస్తున్న బిల్డింగ్‌పై పెంట్‌హౌస్, సెల్లార్., ఎంఈ.ఎస్ కాలనీలలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలే ఇందుకు ఉదాహరణ. 133 మచ్చబోల్లారం డివిజన్‌లో కొంపల్లికి వెళ్లే రోడ్డులో రోడ్ల ప్రక్కన చిన్న షెడ్లలో చిరు వ్యాపారం చేసుకుంటున్న మిగతా 2లో



రేవంత్ పాలనలో శుక్రవారం వచ్చిందంటే చాలు..

# అందరూ భయపడే పరిస్థితి

**సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**హైదరాబాద్, డిసెంబర్ 20 (నినాదం న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డి పాలనలో శుక్రవారం వచ్చిందంటే చాలు.. అందరూ భయపడే పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎవడన్నా నేషనల్ మీడియా ఇంటర్వ్యూలో ఎల్ అండ్ టీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను లోపలేయాలని పోలీసులకు చెప్పిన అని గర్వంగా చెప్పుకుంటడా. అంతకుమించిన తలకుమాసినోడు ఎవడన్న ఉంటడా? ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎల్ అండ్ టి సంస్థకు చెందిన మెట్రో సీఈఓను లోపలేస్తా మిగతా 2లో

ఔరంగజేబు వారసుడు

# రిక్షాలు నడుపుతున్నాడు

దేవాలయాలను కూల్చివేసి, పాడు చేయడంతోనే ఈ దుస్థితి

సీఎం యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు



2

ఫార్ములా ఈ- రేసులో

# అక్రమాలు జరిగిన మాట వాస్తవమే

- అక్రమాలు జరిగినట్టు పలు ఆధారాలున్నాయి
- తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చుకోవడం హాస్యాస్పదం
- కేటీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ విమర్శలు





2

# అధికారుల అండదండలతో అక్రమ నిర్మాణాలు

(మొదటిపేజీ తరువాయి..)

వారి విషయంలో జి.హెచ్.ఎం.సి. అధికారులు అనుమతి లేదంటూ నిర్దాక్షిణ్యంగా కూల్చివేసిన అధికారులకు పెద్దఎత్తున నిర్మిస్తున్న ఈ అక్రమ కట్టడాలు అధికారులకు కనిపించడం లేదా అంటున్నారు. స్థానికులు. పేదవాడికి ఒక్కన్యాయం, డబ్బున్నోడికి ఒక న్యాయమా అంటూ ప్రశ్నిస్తున్నారు. అధికారులకు తెలియకుండానే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయా? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు. అక్రమంగా నిర్మిస్తున్న ఈ నిర్మాణల విషయంలో అధికారుల రాజకీయ నాయకుల పేర్లను వాడుకుంటూ భారీగా దంద నడుపుతున్నారన్నా అనుమానాలు ప్రజల్లో బలపడుతున్నాయి. అల్వాల్ సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్ వ్యవస్థ అనేది ఉన్నదని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఇలాంటి నిర్మాణలను ఆదాయవనరులగా మార్చుకుంటున్నారనేది నిర్వివాదాంశం. అక్రమ నిర్మాణలను అధికారులు ఏమాత్రం ఉపేక్షించరాదని, అనుమతులు లేకుండా నిర్మించే సెల్లార్ లను, పెంట్ హౌస్ లను, షెడ్‌లను అధికారులు నోటీసులతో సరిపెట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండు చేస్తున్నారు.

# రేవంత్ పాలనలో శుక్రవారం వచ్చిందంటే చాలు.. అందరూ భయపడే పరిస్థితి




(మొదటిపేజీ తరువాయి..)

అన్నడు రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ మాజీ కేంద్రమంత్రి దివగంత దాసరి నారాయణ రావు గతంలో చంద్రబాబు పాలన ఎట్లుండెనో చెప్పేందుకు ఓ సినిమా తీసిండు. ఆ సినిమా పేరు పిచ్చోడి చేతిలో రాయి.. అట్లనే రేవంత్ రెడ్డి కూడా ఎప్పుడు, ఎవరి మీద పడుతడో, ఏం కేసులు పెడతడో తెల్వకుండా అయ్యింది. శుక్రవారం వచ్చిందంటే చాలు అందరూ భయపడే పరిస్థితి నెలకొని ఉందని హరీశ్‌రావు తెలిపారు. రైతుల మీద కేసులు, విద్యార్థుల మీద కేసులు, ఆటో డ్రైవర్ల మీద కేసులు, అంగన్ వాడీల మీద కేసులు, ఆశాల మీద కేసులు, చివరకు ఎక్కడి పోయిందంటే.. పోలీసుల మీద కూడా కేసులు పెట్టించిండు. సినిమా వాళ్ల మీద కూడా కేసులు పెట్టించిండు. ఆయన పాలనా వైఫల్యాలపై అడుగడుగునా నిలదీస్తున్న ప్రతిపక్ష నాయకుల మీద కేసులు పెట్టడం పెద్ద విషయమా? కేటీఆర్ మీద కేసులు పెట్టిండు, నా మీద పెట్టిండు, తలసాని మీద పెట్టిండు, పల్లా మీద పెట్టిండు, కౌశిక్ రెడ్డి మీద పెట్టిండు.. మా పట్నం నరేంద్ రెడ్డి అయితే నిన్ననే జైలు నుంచి బయటికి వచ్చిండు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. పోలీసులతో దబాయించు, అక్రమ కేసులు బనాయించు, అబద్దాలతో బుకాయించు. ఢిల్లీలోనేమో రాజ్యాంగ పరిరక్షణ కావాలె, గల్లీలోనేమో రాజ్యంగ భక్షణ చెయ్యాలె. 125 అడుగుల అంబేద్కర్ కే తాళం వేసి పెట్టిన ఘనత రేవంత్ రెడ్డిది. ఎండాకాలం వడ దెబ్బ తప్పించుకోవచ్చు గానీ, రేవంత్ రెడ్డి హైడ్రా దెబ్బ తప్పించుకోలేక రియల్ ఎస్టేట్ ఢమాల్ అయ్యింది. నువ్వు ఎన్ని కేసులు పెట్టినా, మా కేటీఆర్ నీ వెంటపడటం మానరు, నీ బండారం బయటపెట్టడం ఆపరు. ఈ పిచ్చి కేసులకు భయపడి మా లీడర్లు గానీ, క్యాడర్లు గానీ ఎక్కడా తగ్గరు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ కోసం పోరాటం చేసినోళ్లం. వెనుకడుగు వేసిది లేదు అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు.

# ఫార్ములా ఈ- రేసులో అక్రమాలు జరిగిన మాట వాస్తవమే

- అక్రమాలు జరిగినట్టు పలు ఆధారాలున్నాయి
- తనకు తానే సర్టిఫికేట్ ఇచ్చుకోవడం హాస్యాస్పదం
- కేటీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ విమర్శలు



**హైదరాబాద్,డిసెంబర్20 (నినాదం న్యూస్):** ఫార్ములా ఈ-రేస్ కేసులో తాను కడిగిన ముత్యమంటూ కేటీఆర్ తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చుకోవడంపై రియాక్ట్ అయ్యారు టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్. ఫార్ములా ఈ- రేసులో అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనన్నారు. అక్రమాలు జరిగినట్టు పలు ఆధారాలున్నాయన్నారు. తనకు తానే కేటీఆర్ సర్టిఫికేట్ ఇచ్చుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం పంపిన ఆధారాలపై గవర్నర్ న్యాయసలహా తీసుకొని కేసుకు అనుమతించాక అక్రమ కేసు ఎలా అవుతుందని సూటిగా ప్రశ్నించారు. చట్టపరంగా కేసు నమోదు అయినందున కోర్టులో తేల్చుకోవాలని సూచన చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఈ-రేస్‌లో హెచ్ఎండీఏ భాగస్వామ్యం కాకపోయినా విదేశీ సంస్థకు ఆనాడు 55 కోట్ల నిధులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అంతేకాదు మూడేళ్ల పాటు రేసింగ్ జరిగేలా 600 కోట్లతో ఒప్పందం జరగలేదా? అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించారు. ఫార్ములా ఈ రేస్ వల్ల హైదరాబాద్ ప్రతిష్ట ఏ మాత్రం పెరగలేదన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టి ట్రాఫిక్ జాములు చేసి ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహించారని మండిపడ్డారు. ఆధారాలు కనిపిస్తున్నా అక్రమాలకు పాల్పడలేదని కేటీఆర్ బుకాయించడాన్ని తప్పుబట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కంపెనీలకు నిధులు మంజూరు ఎలా చేస్తారని అన్నారు. హద్దుల్లేని కేటీఆర్ అక్రమాలతో అధికారులు బలిపశువులుగా మారారని చెప్పుకొచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా హుస్సేన్‌సాగర్ చుట్టూ ఫార్ములా ఈ రేసు కోసం 2.8 కి.మీల ప్రత్యేక ట్రాక్‌ను ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు. నిబంధనలను అతిక్రమించి ప్రజలను ఇబ్బంది పెట్టడం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడమా? బీఆర్ఎస్ నేతల దోపిడీతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీశారని, ఏం చేసినా వారి స్వలాభం కోసమేనన్నారు. ప్రజలు ఛీకొట్టి గద్దె దింపినా అధికారంలో ఉన్నామనే భ్రమలతో కేటీఆర్ బెదిరింపు వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. కేసులో అధికారులకు సహకరించాల్సిన కేటీఆర్, అహంకారంతో విర్రవీగుతూ ఉద్యమకారులంటూ కేసుకు సంబంధం లేని మాటలు చెప్పడంపై టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్యే మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఔరంగజేబు వారసుడు రిక్షాలు నడుపుతున్నాడు

- దేవాలయాలను కూల్చివేసి, పాడు చేయడంతోనే ఈ దుస్థితి
- సీఎం యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు



**అయోధ్య, డిసెంబర్ 20(నినాదం న్యూస్):** సనాతన ధర్మం ప్రాముఖ్యత గురించి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ సనాతన ధర్మం సురక్షితంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉన్నారని అన్నారు. ఆపద సమయంలో ప్రతి వర్గానికి.. మతానికి ఆశ్రయం కల్పించిన ఏకైక మతం సనాతన ధర్మం అని చెప్పారు. అయితే ఇలా హిందువులకు ఎప్పుడైనా ఆశ్రయం ఇవ్వడం జరిగిందా అనడమే కాదు.. ఇప్పుడు బంగ్లాదేశ్‌లో, అంతకు ముందు పాకిస్థాన్‌లో, ఆఫ్ఘనిస్తాన్‌లో ఏం జరిగిందని ప్రశ్నించారు. అయోధ్యలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. 'దేశంలోని సనాతన ధర్మానికి గర్వకారణమైన స్థలాలను ధ్వంసం చేసిన వ్యక్తులు ఎవరు? ఎందుకు అలా చేశారని తాను అడగాలనుకుంటున్నానని అన్నారు. అంతెందుకు ఇలాంటి ధ్వంసం వెనుక వారి ఉద్దేశం ఏమిటంటే.. ఇలాంటి అనాగరిక చర్యల ద్వారా మొత్తం భూమిని నరకం చేయాలనే కుట్రలో ఒక భాగం అని చెప్పారు.

# ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో మరో కీలక పరిణామం



**హైదరాబాద్,డిసెంబర్20 (నినాదం న్యూస్):** ఫార్ములా-ఈ కార్ రేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫార్ములా-ఈ కార్ రేసు అంశంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కేసు నమోదు చేసింది. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసింది ఈడీ. కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిపై ఈడీ కేసు నమోదు చేసింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఊరట లభించిన సంగతి తెలిసిందే. ఈ నెల 30వ తేదీ వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దని ఆదేశించింది. అయితే ఈ కేసును విచారణ కొనసాగించవచ్చని ఏసీబీకి సూచించింది. అలాగే కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది.

# డిగ్రీకి మళ్లీ పూర్వ వైభవం వచ్చేనా

- డిగ్రీపై తగ్గుతున్న ఆదరణ
- కొత్త ప్రభుత్వంలో ప్రైవేట్ డిగ్రీ కాలేజీల నిర్వాహకుల ఎదురుచూపులు...
- సమాజంలో నైతిక విలువలు నేర్పేది డిగ్రీనే
- డిగ్రీ చదువుతూనే అనేకమంది నేతలు రాజకీయాలలో రాణింపు
- గత ప్రభుత్వంలో కాలేజీలపై ఉక్కుపాదం
- నేటి ప్రజా పాలన ప్రభుత్వంలోనైనా ప్రైవేట్ కళాశాలల బతుకులు మారెనా
- ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 84 డిగ్రీ కళాశాలలు



**కోదాడ, డిసెంబర్20(నినాదం న్యూస్) :** డిగ్రీ విద్యకు పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కారం దిశగా సమీక్ష చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు విద్యావేత్తలు, వివిధ విద్యార్థి సంఘ నాయకులు అభిప్రాయపడుతున్నారు. సాంప్రదాయ డిగ్రీ కోర్సులు చదివిన విద్యార్థులు ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలలో ఎన్నో అవకాశాలను అంది పుచ్చుకుంటున్నారు,సైన్స్ , ఆర్ట్స్, వ్యాపార సంబంధ అంశాల తో కూడిన విద్యను డిగ్రీలో అందించడం వలన విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది అయినప్పటికీ ఎందుకో విద్యార్థులు డిగ్రీ కాలేజీలలో చేరడానికి విముఖత చూపుతున్నారు.

**ప్రస్తుత పరిస్థితి:**
ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు యూనివర్సిటీల పరిధిలో 1064 ప్రభుత్వ మరియు ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు కొనసాగుతున్నాయి. ఉన్నత విద్యా మండలి చెప్తున్న లెక్కల ప్రకారం 4.6 లక్షల సీట్లు గతంలో అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది 3.89 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 2.4 లక్షల సీట్లు మాత్రమే డిగ్రీ అడ్మిషన్ పొందారు. ఇంకా దాదాపు1.84 లక్షల సీట్లు మిగిలిపోయాయి. ఇది ఆందోళన కలిగించే అంశం. ప్రతి ఏడాది రెండు లక్షల సీట్ల వరకు మిగిలిపోతున్నాయి. ప్రతి ఏడాది పదుల సంఖ్యలో కాలేజీలు మూతపడుతున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా అడ్మిషన్లు తగ్గుతుండడం కొసమెరుపు.

**ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల కాక:**
రాష్ట్రంలో 12 లక్షల మంది విద్యార్థులకు గత రెండున్నర సంవత్సరాల నుండి 3500 కోట్లు రూపాయలు ప్రభుత్వం బకాయి ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 30,000 మంది డిగ్రీని అభ్యసిస్తున్నారు. ప్రైవేట్ కళాశాల చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ సకాలంలో రాకపోవడం వలన విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నారు. స్కాలర్షిప్ రాకపోవడం వలన యాజమాన్యాలుఅధ్యాపకులకు సరైన సమయంలో జీతాలు ఇవ్వకపోవడం అధ్యాపకులు వేరే రంగాన్ని ఎంచుకుంటున్నారు . యాజమాన్యాలు బ్యాంకు బకాయిలు, బిల్డింగ్ అద్దె, ఇతర ఖర్చులు భరించలేని పరిస్థితుల్లో ఉన్నారు.


**దోస్త్ ఆన్లైన్, సెమిస్టర్ లపై సమీక్ష చేయాలి:**
ఉన్నత విద్యా మండలి దోస్త్ ఆన్లైన్( డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా 2016 నుండి రిజిస్ట్రేషన్ చేయించి విద్యార్థులు కోరుకున్న కళాశాలకు సీట్ల కేటాయింపు చేస్తుంది. ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు స్థానికంగా ఉండే డిగ్రీ కాలేజీలలో అడ్మిషన్ పొందకుండా పెద్ద పట్టణాలలో ఉండే కాలేజీలలో అడ్మిషన్లు పొందుతున్నారు. తద్వారా మండల కేంద్రాలలో, మున్సిపాలిటీలలో, జిల్లా కేంద్రాలలో ఉండే డిగ్రీ కళాశాలలు వెలవెలబోతున్నాయి. దోస్త్ ఆన్లైన్ ప్రక్రియ మే నెలలో ప్రారంభమై అక్టోబర్ లో పూర్తవుతుంది. తద్వారా చాలా కాలయాపన జరుగుతుంది. 2016 కంటే ముందు విద్యార్థులు అడ్మిషన్ ఫామ్ పూర్తి చేసి కళాశాలలో అడ్మిషన్ పొందేవారు.రెండు నెలల్లోనే అడ్మిషన్ ప్రక్రియ మొత్తం పూర్తయ్యేది. బాధాకరమైన విషయం ఏమిటంటే ఈ ఏడాది చాలా కాలేజీలలో విద్యార్థులు 100 లోపు అడ్మిషన్లు మాత్రమే పొందారు. ఇది ఒకరకంగా ఆందోళన కలిగించే విషయం.

**సెమిస్టర్ పై విద్యార్థుల విముఖత...**
డిగ్రీలో సెమిస్టర్ విధానాన్ని చాలామంది విద్యార్థులు విముఖత చూపుతున్నారు. ఇంజనీరింగ్, ఫార్మసీ లాంటి కోర్సులలో సెమిస్టర్ విధానం కొనసాగుతుంది. వాటిలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువ కనిపించడం వలన ఏదైనా సెమిస్టర్ విద్య కాబట్టి ఇంజనీరింగ్ లాంటి కోర్సులను విద్యార్థులు ఎంచుకుంటున్నారు. విద్యార్థులలో డ్రాపౌట్స్ తగ్గించే ప్రయత్నంలో సెమిస్టర్ విద్యా విధానం ప్రవేశపెట్టినట్టు తెలుస్తుంది వాస్తవంగా విద్యార్థులలో డ్రాపౌట్స్ పెరిగింది. మొదటి సెమిస్టర్ లో అడ్మిషన్ పొందిన విద్యార్థుల సంఖ్య చివరి సెమిస్టర్ వచ్చేనాటికి అడ్మిషన్లు తగ్గుతున్నాయి. డిగ్రీ విద్యార్థులకు సెమిస్టర్ విద్యా విధానం అవసరమా? లేదా అనేదానిపై వివిధ యూనివర్సిటీల విద్యావేత్తలతో ప్రభుత్వం సమీక్ష చేస్తే బాగుంటుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు.

### సెమిస్టర్‌తో డ్రాప్ అవుట్స్ ఎక్కువగా నమోదవుతున్నాయి...

**– సిరికొండ శ్రీనివాస్, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, కోదాడ పట్టణం, సూర్యాపేట జిల్లా**

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 84 ప్రభుత్వ ప్రవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.ప్రభుత్వం దోస్త్ ఆన్లైన్, సెమిస్టర్ విధానం రద్దుచేసివిద్యార్థులకు 2015 ముందున్న పరీక్షల విధానం తీసుకురావాలి. ఫీజు రియంబర్స్మెంట్ సకాలంలో విడుదల చేయాలి. సెమిస్టర్ విధానం వలన చాలామంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేక మధ్యలోనే చదువు మానేస్తున్నారు. డ్రాప్ అవుట్స్ డిగ్రీ స్థాయిలో 2016 ఓండి ఎక్కువమంది విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి డిగ్రీ కాలేజీలకు పూర్వ వైభవం తీసుకురావాలి.



# ఇంటిముందు వాహనం పార్కింగ్ చేస్తున్నారా జాగ్రత్త

- జమ్మికుంటలో వరుస దొంగతనాలు
- వారం రోజుల్లో నాలుగు ద్విచక్ర వాహనాలు చోరీ
- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న బాధితులు
- దొంగలను త్వరలోనే పట్టుకుంటాం పట్టణ సిఐ వరగంటి రవి



**జమ్మికుంట, డిసెంబర్20 (నినాదం న్యూస్) :** జమ్మికుంట పట్టణంలో వరుస దొంగతనాల తో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల్లో మున్సిపల్ పరిధిలో నాలుగు ద్విచక్ర వాహనాలు దొంగతనానికి గురయ్యాయని తెలుస్తుంది. కొంతమంది వాహనం పోయిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. వరుస దొంగతనాలతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. గతంలో వారసంత రోజున నగలు సెల్ ఫోన్ లు దొంగతనానికి గురవడం ప్రజలు మర్చిపోకముందే ఇప్పుడు దొంగల చూపు ద్విచక్ర వాహనాలపై పడింది. ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగలు ఎత్తుకెళ్లడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వాహనం పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేసిన వాహనం దొరుకుతుందన్న నమ్మకం ప్రజల్లో లేదు. ఇంత జరిగిన పోయిన సొత్తు రికవరీ అవుతుందనే నమ్మకం ప్రజలకు పూర్తిగా పోయింది. గతంలో దొంగతనం జరిగిన ఇప్పటివరకు చాలా వరకు సొత్తు రికవరీ కాకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కేసులను పోలీసులు చేదించినప్పటికీ పూర్తిస్థాయిలో సొమ్ము రికవరీ కాకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వాటి పనితీరు సరిగా లేకపోవడంతో దొంగలు యదేచ్ఛగా దొంగతనాలు చేస్తున్నారు. ఒకవైపు ద్విచక్ర వాహనాల నుండి పెట్రోల్ దొంగిలిస్తూ వాహనదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు దొంగలు. పెట్రోల్ మాత్రమే పోయిందని ఆవేదన చెందిన ప్రజలకు ఇప్పుడు ఏకంగా ద్విచక్ర వాహనాలను దొంగలు ఎత్తుకు వెళ్తుండడంతో ఇంటిముందు వాహనం పార్కింగ్ చేయాలంటే ప్రజలు గజగజ వనికి పోతున్నారు. లక్షల రూపాయల విలువచేసే వాహనాలు రాత్రికి రాత్రి మాయం కావడంతో ప్రజలు ఆందోళన పడుతున్నారు.

**ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం.**
దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితం ఉండడం లేదని గతంలో పలు ఇళ్లల్లో దొంగతనం జరిగిన సత్తు రికవరీ అయినప్పటికీ ఆ సొత్తును బాధితులకు అందాలంటే బాధితులకు చుక్కలు కనబడుతున్నాయి. దొంగలించబడ్డ సొత్తు కోర్టులో రికవరీ చేసిన కోర్టు నుండి తీసుకోవాలంటే బాధితులకు వాటిపై ఆశ ను వదులుకోవాల్సి వస్తుంది. పావలా కొడుకు రూపాయి మసాలా లెక్క పోయిన సొత్తు తీసుకోవాలంటే భారీ మొత్తంగా ఖర్చు అవుతుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొంతమంది దొంగతనం జరిగిన కేసు పెట్టడానికి భయపడుతున్నారు. ఎందుకంటే పోయిన సొత్తు దొరికినప్పటికీ అది మాకు వస్తుందని నమ్మకం లేదని పైగా పోయిన సొత్తు విలువ కన్నా దానికోసం తిరిగే ఖర్చు ఎక్కువ అవుతుందని బహిరంగంగానే చెబుతున్నారు.


**దొంగలను త్వరలోనే పట్టుకుంటాం.**
**సిఐ వరగంటి రవి.**
వరుస దొంగతనాల విషయంలో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తత చేస్తున్నామని మా బ్లూ కోర్టు సిబ్బంది తోపాటు స్పెషల్ పార్టీ పోలీసులు నిరంతరం గస్తీ తిరుగుతున్నారని అయినప్పటికీ దొంగతనాలు జరుగుతున్నాయని త్వరలోనే దొంగలను పట్టుకుని సొత్తు రికవరీ చేస్తామని సీఐ వరగంటి రవి తెలిపారు. ద్విచక్ర వాహనాలు పోయినట్టు కొంతమంది మాకు ఫిర్యాదు చేశారని వాహనాల చెకింగ్ లో అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజలు తమ వాహనాలను వీలైనంతవరకు ఇంటి లోపల పార్కింగ్ చేసుకుని కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఇంటికి తాళం వేసి వేరే ఊరు వెళితే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

## తిరిగి మహాదేవపూర్‌లో కొలువు తీరనున్న మాడా కార్యాలయం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** ఇప్పటివరకు ఎటునాగారం ఐటీడీఏ కార్యాలయంలో కొనసాగుతున్న మహాదేవపూర్ మాడా ఆఫీసులన్నింటినీ మహాదేవపూర్ లోని రెవెన్యూ ఆఫీస్ పై అంతస్తులో పునః ప్రారంభించాలని ఐటీడీఏ నిర్ణయించింది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, మంథని శాసనసభ్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఆఫీసులన్నింటినీ మాదాపూర్ లో పున ప్రారంభించనున్నారు.దశాబ్దాల క్రితం మహాదేవపూర్ లో గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన ఐటీడీ ఓ మేనేజర్ గిరిజన కార్పొరేషన్ భూపాలపల్లి, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఆఫీసును ఏర్పాటు చేయాలని ఆదేశించిన మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలను అమలు చేస్తూ ప్రస్తుత రెవెన్యూ కార్యాలయం పై అంతస్తులు ఆఫీసును ప్రారంభించినట్లు ఐటిడిఏ ఆఫీస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాంత గిరిజనులు తమ సమస్యలను విన్నవించుకునే విధంగా ప్రజావాణి కార్యక్రమాన్ని మాడా కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు.తరలిపోయిన కార్యాలయాన్ని తిరిగి మహాదేవపూర్ లో ఏర్పాటు చేయడం పట్ల కాటారం డివిజన్ ప్రాంత ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# సైబర్ నేరగాళ్ల కొత్త ట్రిక్కులు




అనవసర లింక్లను ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాలోని సొమ్ము ఖాళీ అవ్వడం ఖాయం.

- **రోజుకో కొత్త తరహాలో సైబర్ నేరాలు**
- **పీఎం కిసాన్ యోజన పేరుతో వాట్సాప్లలో చక్కర్లు కొడుతున్న నకిలీ లింక్‌లు**
- **అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు**

**కోదాడ/అనంతగిరి, డిసెంబర్ 20 (నినాదం న్యూస్):** ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థ లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్నీ తమ రోజువారి కార్యకలాపాల్లో అమలు చేస్తుండగా.. సైబర్ నేర గాళ్లు అంతకుమించిన టెక్నాలజీని వినియోగిస్తూ అమాయక ప్రజల సొమ్మును కాజేస్తున్నారు. ప్రభుత్వ పథకాల్లో నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం ఇస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన సైబర్ నేరగాళ్లకు మంచి అవకాశంగా మారింది. విద్యావంతులతో పాటు సామాన్య ప్రజలు కూడా ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం యాప్ల ద్వారా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ఇదే సైబర్ నేరగాళ్లకు వరంగా మారింది.

**ఏపీకే ఫైళ్లతో ప్రమాదం..**

సైబర్ నేరగాళ్లు ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ లేదా ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే) ఫైళ్లను వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. వాటిని ఓపెన్చేసి ఓకే అని క్లిక్ చేస్తే.. సంబంధిత వ్యక్తుల ఫోన్లు హ్యాక్ అవుతున్నాయి. ఫలితంగా మనకు సంబంధం లేకుండానే మన ఫోన్ నియంత్రణ సైబర్ నేర గాళ్ల చేతిలోకి వెళ్తుంది. తమ ఫోన్ హ్యాక్ అయ్యిం దని తెలియని వారు డిజిటల్ ప్లాట్ఫామ్స్ ద్వారా సొమ్ము పంపితే వెంటనే హ్యాక్ చేసిన మొబైల్ నం బర్ ద్వారా పిన్ నంబర్ తెలుసుకుని నిమిషాల్లో ఆ వ్యక్తి బ్యాంకు ఖాతాలోని నగదు కాజేస్తున్నారు. హ్యాక్ చేసిన మొబైల్ డివైస్ డిస్ప్లే సైబర్ నేరగాళ్ల చేతిలో ఉంటుంది. దీని ప్రకారం ఆ ఫోన్లో ఉన్నకాంటాక్ట్ నంబర్లకు ఫోన్ హ్యాకింగ్కు గురైన వ్యక్తి పంపినట్లు ఏపీకే ఫైళ్లను పంపుతున్నారు. నిజం గానే మనకు తెలిసిన వ్యక్తి నుంచే ఈ మెసేజ్ వచ్చిందని భావించి ఏపీకే ఫైళ్ల లింక్ ఓపెన్ చేస్తున్నారు. దీంతో బ్యాంకు ఖాతాలో సొమ్ము కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ యోజన పథకం పేరిట లింక్ పంపు తున్నారు. ఈ లింక్ను ఓపెన్ చేసినా కూడా ఫోన్ హ్యాక్ అయ్యి మనకు సంబంధం లేకుండానే బ్యాం కు అకౌంట్ నుంచి డబ్బులను సైబర్ నేరగాళ్లు లాగేసుకుంటు న్నారు. సోషల్ మీడియాలో వచ్చే

**జాగ్రత్తగా ఉండాలి..**
**అనంతగిరి ఎస్సై, నవీన్ కుమార్**




సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ పథకాల పేరుతో లింక్లు పంపుతున్నారు. వాటిని ఓపెన్ చేస్తే సైబర్ నేరగాళ్ల మాయలో చిక్కినట్లే అవుతుంది. ఎవరైనా సైబర్ మోసానికి గురై నా, ఫోన్ హ్యాక్ అయ్యి తమ ప్రమేయం లేకుండానే బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు పోతే వెంటనే సైబర్ క్రైం హెల్ప్ నంబర్ 1930కి డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

# వ్యవసాయ వర్సిటీ ప్రపంచ స్థాయికి ఎదగాలి

- **గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**





**రంగారెడ్డి, మహేశ్వరం, డిసెంబర్ 20 (నినాదం న్యూస్) :** 2047 నాటికి వ్యవసాయ రంగంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయికి ఎదగాలని విశ్వవిద్యాలయం కులపతి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. భాగస్వాముల అందరితో సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణలో పురోగతి సాధించాలని సూచించారు. రాజేంద్రనగర్ లో రెండు రోజులపాటు జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలకు ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. రాజేంద్రనగర్ లోని పిజెటిఎయు క్రీడా మైదానంలో కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శనల్ని ప్రారంభించారు. వివిధ స్టాళ్లను పరిశీలించారు. తర్వాత ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వజ్రోత్సవాల మీనియేచర్ పైలాన్ ని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పిజెటిఎయు ఉపకులపతి అల్దాస్ జానయ్య తో కలిసి ప్రారంభించారు. కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ గుర్తింపు పత్రాలని అందజేశారు. తర్వాత విశ్వవిద్యాలయం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులని ఉద్దేశించి ప్రసంగించారు. 60 ఏళ్లుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ అభివృద్ధికి అసమాన సేవల్ని అందించిందన్నారు. సొనామసూరి, తెలంగాణ సోనా వంటి వంగడాలు రూపొందించిందన్నారు. భవిష్యత్ ప్రణాళికల అమలులో విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోవాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ వంటి అధునాతన పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంలోకి విస్తృతంగా తీసుకురావాలని గవర్నర్ సూచించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ సహాయంతో విశ్వవిద్యాలయం త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ నీ ప్రారంభించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ విద్యని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఫీజులు తగ్గించడం స్వాగతించదగినదన్నారు. జై జవాన్, జై కిసాన్ అనే నినాదం ఇచ్చిన మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి చేతుల మీద ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం వాతావరణ మార్పులు వంటి కొత్త సవాళ్లని ఎదుర్కొని మంచి భవిష్యత్తు దిశగా అడుగులు వేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని గవర్నమెంట్ పిలుపునిచ్చారు. ఉదయం ఉత్సవాల ప్రారంభ సదస్సులోనూ. స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నిర్వహించిన కిసాన్ మేళా లోను తుమ్మల నాగేశ్వరరావు రైతులని ఉద్దేశించి ప్రసంగించారు. 60 ఏళ్ల చరిత్ర కలిగిన విశ్వవిద్యాలయం భవిష్యత్తులో దేశానికి దిక్సూచిగా మారాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా డిమాండ్ ఉన్న పంటలు, మన నేల స్వభావానికి తగ్గట్లుగా అనువైన పంటలు, అందుకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలను రైతులకు అందించాలని విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలకి ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు వ్యవసాయ సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్నారు. రైతు బీమా, రైతు రుణమాఫీలతో పాటు సంక్రాంతి తర్వాత రైతు భరోసాను అమలు చేస్తామన్నారు. హార్టికల్చర్, పంటలు, కూరగాయలు పామాయిల్ సాగు పెరగాలన్నారు. బిందు, తుంపర సేద్యం, వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, శీతల గిడ్డంగుల నిర్మాణానికి చేయుతనిస్తామన్నారు. భవిష్యత్తులో పెద్ద సంఖ్యలో వ్యవసాయ పట్టభద్రులు రావాలని వ్యవసాయ రంగంలో అధిక జనాభా నిమగ్నం కావాలని తుమ్మల ఆకాంక్షించారు. దేశ ప్రధానుల చేతుల మీద ప్రారంభమైన విశ్వవిద్యాలయం రైతాంగానికి ఎల్లప్పుడూ చేదోడువాదోడుగా ఉందని ఆయనన్నారు. గత కొన్నేళ్లుగా ఈ విశ్వవిద్యాలయం వెనుకబాటుకి గురి అయింది అని.. దాని అధిగమించి పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని ఉపయోగించుకుని పరిశోధన, విస్తరణ విద్యలో ముందుకెళ్లాలని మంత్రి సూచించారు. రానున్న రోజుల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం మొదటి 10 ర్యాంకుల్లో నిలవాలని తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అన్ని విధాల తోడ్పాటు అందిస్తుందన్నారు. ప్రతి వ్యవసాయ కళాశాల పరిధిలో ఒక “మోడల్ అగ్రికల్చర్ ఫార్మ్” ను అభివృద్ధి చేయాలన్నారు. వాతావరణ మార్పుల కనుగుణంగా కరికులమ్ లో రీసెర్చ్ లో మార్పులు తీసుకురావాలని, ఆర్టిఫిషియల్, డిజిటల్ టెక్నాలజీలను వినియోగించుకోవాలని తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వజ్రోత్సవ ఉత్సవాల ప్రారంభ సమావేశంలో భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ సభ్యులు రమేష్ చంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత ఉపకులపతి అల్దాస్ జానయ్య తో తనకు పూర్వం నుంచి పరిచయం ఉందని ఆయన నాయకత్వంలో విశ్వవిద్యాలయ అభివృద్ధి పథాన సాగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గత విజయాలతో సంతృప్తి చెందకుండా భవిష్యత్తు లక్ష్యాల్ని నిర్దేశించుకోవాలన్నారు. నిధుల లభ్యత తగ్గడం వల్ల పరిశోధనలు వెనుకబడుతున్నాయని ఆ విషయంపై దృష్టి సారించాలన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఆహార ధాన్యాల ఉత్పాదక గణనీయంగా పెరిగిందన్నారు. తెలంగాణలో నీటిపారుదల సౌకర్యాలు, ఆహార ధాన్యాలు ఉత్పత్తి బాగా పెరిగిందన్నారు. అయితే కూరగాయలు, ఉద్యానవన పంటలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిలో వెనుకబడి ఉన్నామని దీన్ని అధిగమించాలన్నారు. అదేవిధంగా వ్యవసాయ విద్యనభ్యసించిన వాళ్ళు కేవలం ఉద్యోగాల కోసమే చూడకుండా ఎంటర్ ప్రెన్యూర్ లుగా తయారు కావాలని రమేష్ చంద్ సూచించారు. గతంలో రైతులకి దక్కిన గౌరవం నేడు దక్కడం లేదని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి అన్నారు. రైతుకి వ్యవసాయానికి మూలమైన విత్తనాలు 90 శాతం ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లడం దురదృష్టకరమని ఆయనన్నారు. ఈ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతులు, వ్యవసాయ సంక్షేమం ప్రథమ ప్రాధాన్యాలని అందుకు అనుగుణంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పనిచేయాలన్నారు. శాస్త్రవేత్తలు గ్రామాల్ని దత్తత తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో సహకార వ్యవసాయ విధానం అవసరమని కోదండ రెడ్డి అన్నారు. రైతు సుఖంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భూమి, విత్తనం, నీరు, రైతు చెమట వ్యవసాయానికి ఆధారాలన్నారు. మన వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశానికి తలమానికంగా ఉండాలని ఆకాంక్షించారు. పురుగుమందుల రహిత వ్యవసాయం కోసం మనమందరం కృషి చేయాలని పోచారం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సందర్శించడం గొప్ప అనుభవం అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నా రెడ్డి అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈమధ్య ప్రధాని 131 కొత్త వంగడాలు విడుదల చేశారని వాటిలో కనీసం మన విశ్వవిద్యాలయం వంగడాలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. విద్య, పరిశోధన, విస్తరణల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొంతమంది వ్యతిరేకిస్తున్నప్పటికీ జన్యు మార్పిడి పంటల సాగు నీ నుసరించవలసిందేనన్నారు. రాష్ట్రంలో ఉన్న ఇక్రిసాట్, క్రిడా వంటి సంస్థల సహకారం తీసుకోవాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టెక్నాలజీలని వ్యవసాయ రంగంలో విస్తృతంగా వినియోగించుకోవాలని చిన్నారెడ్డి సూచించారు. రైతుల కష్టాలు నాటికి నేటికి అలానే ఉన్నాయని మాజీ ముఖ్యమంత్రి, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నాదెండ్ల భాస్కరరావు అన్నారు. ధరల పెరుగుదల, వాతావరణ మార్పులకి అనుగుణంగా రైతులకి చాలా చేయవలసి ఉందని ఆయన అన్నారు. వందేళ్ళ క్రితమే వ్యవసాయంగా ప్రాముఖ్యత గురించి మహాత్మా గాంధీ చెప్పారని మరో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సమరసింహా రెడ్డి అన్నారు. వ్యవసాయానికి అవసరమైన అన్నింటిని రైతులకు అందుబాటులో ఉంచాలని సమరసింహారెడ్డి సూచించారు. 60 ఏళ్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రస్తానాన్ని పిజెటిఎయు ఉపకులపతి అల్దాస్ జానయ్య వివరించారు. నాటి ప్రధానులు లాల్ బహుదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ లు, రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, ఉపరాష్ట్రపతి మొరార్జీ దేశాయ్ లు వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం చుట్టూ సుమారు 10 భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సంస్థలు ఉన్నాయన్నారు. అదేవిధంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వల్ల హైదరాబాద్ విత్తన రాజధానిగా రూపొందిందని జానయ్య వివరించారు. 60 ఏళ్లలో సుమారు 500 వంగడాలని విడుదల చేశామన్నారు. అదేవిధంగా సుమారు 32 వేల మంది గ్రాడ్యుయేట్లు బయటకొచ్చారన్నారు. 12 రాష్ట్రాల్లో సుమారు 3 కోట్ల ఎకరాల్లో విశ్వవిద్యాలయం రూపొందించిన వరి విత్తనాలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఇతర పంటల్లోనూ విశ్వవిద్యాలయం రూపొందించిన వంగడాలు విస్తృత వ్యాప్తి పొందాయన్నారు. 21 పేటెంట్లు సాధించామన్నారు అలాగే పౌల్ట్రీ, పశుసంవర్ధక రంగాల్లోనూ వ్యవసాయ విశ్వవిద్యాలయం అపూర్వ ప్రగతి సాధించిందని అల్దాస్ జానయ్య అన్నారు. ఈ సందర్భంగా 60 ఏళ్ల విశ్వవిద్యాలయం ప్రయాణం పై ఒక లఘు చిత్రాన్ని విడుదల చేశారు. అలాగే వివిధ సాగు పద్ధతులపై అనేక ప్రచురణల్ని కూడా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎపిసి రఘునందన్ రావు, కమిషనర్ బి.గోపి, విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ బాల్ రాజు, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డి. రాజి రెడ్డి, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, పద్మశ్రీ గ్రహీతలు చింతల వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వర రావు, విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతులు రఘువర్ధన్ రెడ్డి, రాఘవ రెడ్డి, పద్మరాజు, వెటర్నరీ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రభాకర్ రావు, పూర్వ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కిసాన్ మేళా వేదికపై పలువురు తమ రైతులకు ఈ సందర్భంగా అవార్డులను బహుకరించారు.

# ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయనున్న ఫిజిక్స్ వాలా, టీబీఐ

**-మంత్రి నారా లోకేశ్ నివాసంలో ఒప్పందాలపై సంతకాలు**

**-ఉన్నత విద్య ఆధునీకరణకు టీబీఐతో ఒప్పందం**



**అమరావతి, డిసెంబర్ 20(నినాదం న్యూస్):** అధునాతన సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగేందుకు అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్ లో డీప్-టెక్ ను అభివృద్ధి చేయడంలో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండు ప్రధాన సంస్థలతో కీలక ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఈ రెండు ఒప్పందాలు జరిగాయి. ఫిజిక్స్ వాలా ఎడ్యుటెక్ కంపెనీ తన పరిశ్రమ భాగస్వామి అమెజాన్ వెబ్ తో కలిసి ఆంధ్రప్రదేశ్ లో ఏఐ-ఫోకస్డ్ ఫస్ట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ ... యూనివర్సిటీ ఆఫ్ ఇన్నొవేషన్ ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. మరోవైపు, రాష్ట్రంలో ఉన్నత విద్యను ఆధునీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ తో ఏపీ ప్రభుత్వం మరో ఒప్పందం చేసుకుంది. ఉండవల్లి నివాసంలో నారా లోకేశ్ సమక్షంలో ఫిజిక్స్ వాలా, టోనీబ్లెయిర్ ఇన్స్టిట్యూట్ ప్రతినిధులు వేర్వేరుగా ఏపీ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం అకడమిక్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్స్ ను ఏకీకృతం చేసే దిశగా పని చేస్తుంది. పరిశోధన, విద్య, ఉపాధిలో కీలక సవాళ్లను పరిష్కరించడంపై దృష్టిసారిస్తుంది. హబ్-అండ్-స్పోక్ మోడల్‌ను అనుసరించి ఇన్నోవేషన్ యూనివర్సిటీ సెంట్రల్ హబ్‌గా పనిచేస్తుంది. దీని ద్వారా విభిన్న నేపథ్యాలు, ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు సమకాలీన, హైబ్రిడ్ విద్య అందుబాటులోకి వస్తుంది. ఆన్‌లైన్, వ్యక్తిగత అభ్యసన అనుభవాలను ఇంటిగ్రేట్ చేస్తారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... కృత్రిమ మేధ (ఏఐ)లో ఏపీ యువతను నెం.1గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా ఈ ఒప్పందాలు జరిగాయని అన్నారు. అధునాతన ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడం, అందుకు ఏపీ యువతను సన్నద్ధం చేయడమే తమ లక్ష్యమన్నారు. పరిశ్రమల డిమాండ్, ప్రమాణాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్ మెంట్ పై యూనివర్సిటీ ఆఫ్ ఇన్నోవేషన్ దృష్టిసారిస్తుందని చెప్పారు. అధునాతన సాంకేతికత, విద్యను ఏకీకృతం చేయడానికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ కృషి చేస్తుందని చెప్పారు. ఏఐలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక, నెక్స్ట్ జనరేషన్ నైపుణ్యాలకు మార్గం సుగమం చేస్తున్నామని మంత్రి లోకేశ్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో ఉన్నత విద్య వ్యవస్థను ఆధునీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవగాహన ఒప్పందం )పై సంతకం చేసింది. ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఏపీ విద్యార్థులను తీర్చిదిద్దడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. అంతర్జాతీయంగా విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏపీ ఉన్నత విద్యలో చేయాల్సిన మార్పులపై టోనీ బ్లెయిర్ ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ ప్రభుత్వానికి సలహా ఇస్తుంది. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించే విద్యా విధానాలను గుర్తిస్తుంది. విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో తృతీయ విద్య ల్యాండ్ స్కేప్ ను మెరుగుపర్చడానికి కృషిచేస్తుంది. ఏపీలో సమగ్ర, స్థిరమైన ఆర్థికవృద్ధి వేదిక ఏర్పాటుకు అవసరమైన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. ప్రస్తుత వ్యవస్థలో నైపుణ్య అంతరాలను గుర్తించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ విధానాలను అమలుచేసేందుకు ఏపీ ప్రభుత్వంతో టీబీఐ కలిసి పనిచేస్తుంది. ఇందుకు అవసరమైన సమగ్ర రోడ్ మ్యాప్ ను అభివృద్ధి చేయడంలో సహకరిస్తుంది.


# వైసీపీని వరుసగా వీడుతున్న నేతలు

**విశాఖ డెయిరీ ఛైర్మన్, 12 మంది డైరెక్టర్లు రాజీనామా**



**అమరావతి, డిసెంబర్ 20(నినాదం న్యూస్):**అధికారాన్ని కోల్పోయిన తర్వాత వైసీపీ గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. ప్రతి రోజు ఎవరో ఒకరు పార్టీకి గుడ్ బై చెపుతున్నారు. ఇప్పటికే ఎంతోమంది ప్రజాప్రతినిధులు వైసీపీని వీడారు. తాజాగా ఆ పార్టీకి మరో షాక్ తగిలింది. విశాఖ డెయిరీ ఛైర్మన్ అడారి ఆనంద్ కుమార్ వైసీపీకి వీడ్కోలు పలికారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఆనంద్ పేర్కొన్నారు. ఆనంద్ తో పాటు 12 మంది డెయిరీ డైరెక్టర్లు కూడా వైసీపీకి రాజీనామా చేశారు. వీరిలో వరాహా వెంకట శంకర్రావు, పిల్లా రమా కుమారి, కోళ్ల కాటమయ్య, శీరంరెడ్డి సూర్యనారాయణ, ఆరంగి రమణబాబు, రెడ్డి రామకృష్ణ, దాడి పవన్ కుమార్, పరదేశి గంగాధర్, సుందరపు ఈశ్వర్, చిటికెల రాజకుమారి తదితరులు ఉన్నారు. వీరంతా తమ రాజీనామా లేఖలను వైసీపీ కేంద్ర కార్యాలయానికి పంపించారు.

# పార్లమెంట్ నిరవధిక వాయిదా



**న్యూఢిల్లీ,డిసెంబర్20(నినాదం న్యూస్):** పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడింది. ఉభయసభలు వాయిదా పడ్డాయి. విపక్ష సభ్యుల ఆందోళనతో స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సభను వాయిదా వేసే సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ఉన్నారు. జమిలి ఎన్నికల ముసాయిదాను జేపీసీకి పంపాలన్న తీర్మానాన్ని ప్రవేశ పెట్టాలని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను స్పీకర్ ఓం బిర్లా కోరారు. ఆ బిల్లును ప్రవేశ పెట్టిన తర్వాత జాయింట్ పార్లమెంటరీ కమిటీకి వన్ నేషన్- వన్ ఎలక్షన్ బిల్లును పంపిన తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక, మరో వైపు విపక్ష ఎంపీల ఆందోళనతో రాజ్యసభను సైతం ఛైర్మన్ జగదీప్ దన్‌ఖడ్ వాయిదా వేశారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో (చితినిబిస ఃూబబతినీని) ఉభయ సభల్లోనూ విలువైన సమయం వృథా అయ్యింది. లోక్‌సభ భారీ అంతరాయాలను ఎదుర్కొంది. మూడవ సెషన్‌లో 65 గంటలు, మొత్తం మూడు సెషన్‌లలో కలిపి 70 గంటలకు పైగా సమయాన్ని కోల్పోయింది. నవంబర్ 25న ప్రారంభమైన పార్లమెంటు శీతాకాల సమావేశాలు మూడు విడతలుగా కొనసాగాయి. డిసెంబర్ 19న లోక్‌సభలో గొడవ, ప్రతిపక్ష ఎంపీల నిరసనల నేపథ్యంలో పార్లమెంటు సమావేశాలు ఆకస్మికంగా ముగిశాయి. శుక్రవారం ఉభయ సభలూ నిరవధికంగా వాయిదాపడ్డాయి. మరో వైపు ఈరోజు ఉదయం పార్లమెంట్ ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర.. ఇండియా కూటమి ఎంపీలు నిరసనకు దిగారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ను అవమానించిన కేంద్రమంత్రి రాజీనామా చేయాలని విజయ్ చౌక్ వద్ద విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. దీంతో ఇండియా కూటమి సభ్యుల తీరుపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా మర్యాదలను సభ్యులు కాపాడాలన్నారు.. సభలో ధర్నాలు, ప్రదర్శనలు చేయడం సరికాదని స్పీకర్ ఓం బిర్లా సూచించారు. కాగా, అధికారిక సమాచారం ప్రకారం లోక్‌సభ మొదటి సెషన్‌లో 5 గంటల 37 నిమిషాలు వృథా అయ్యాయి. రెండవ సెషన్‌లో గంటా 53 నిమిషాలు, ముగింపు సెషన్‌లో ఆశ్చర్యకరంగా 65 గంటల 15 నిమిషాలు లోక్‌సభ కోల్పోయింది. లోక్‌సభ తొలి సెషన్‌లో ఏడు, రెండో సెషన్‌లో 15, మూడో సెషన్‌లో 20 సమావేశాలు జరిగాయి. తొలి సెషన్‌లో ఏడు గంటలు, రెండో సెషన్‌లో 33 గంటలకుపైగా, మూడో సెషన్‌లో 21.7 గంటలపాటు చర్చల్లో ఎంపీలు పాల్గొన్నారు. మరోవైపు రాజ్యసభ తొలి సెషన్‌లో 34.16 గంటల పాటు చర్చ జరిగింది. రెండో సెషన్‌లో చర్చా సమయం 115.21 గంటలకు పెరిగింది. అయితే మూడవ సెషన్‌లో చర్చల సమయం 62 గంటల కనిష్టస్థాయికి పడిపోయింది.

# ఎన్‌హెచ్‌ఆర్‌సి పదవికి చంద్రచూడ్ పేరు

**-ప్రచారాలను ఖండించిన మాజీ సిజె**



**న్యూఢిల్లీ, డిసెంబర్ 20(నినాదం న్యూస్):** జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ పదవికి తన పేరును పరిశీలిస్తున్నట్లు మీడియాలో వచ్చిన కథనాలు అవాస్తవమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ప్రస్తుతం తాను కుటుంబంతో కలిసి సమయం గడుపుతున్నానని.. మరో పదవిని స్వీకరించే ఆలోచన ఇప్పటికైతే లేదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా పదవీకాలం పూర్తి అయిన జూన్ 1నుంచి ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్‌పర్సన్ పదవి ఖాళీగా ఉంది. తదుపరి ఛైర్‌పర్సన్‌ను ఎంపిక చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సమావేశమైనట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్ ప్రాంగణంలో ఇటీవల జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం హాజరైన విషయం తెలిసిందే. ఎన్‌హెచ్‌ఆర్‌సీ చీఫ్‌ని ఎంపిక చేసే కమిటీకి ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తుండగా.. ఇందులో లోక్‌సభ స్పీకర్, హోంమంత్రి, లోక్‌సభ, రాజ్యసభలో విపక్షాల నాయకులు, రాజ్యసభ డిప్యూటీ ఛైర్‌పర్సన్ సభ్యులుగా ఉంటారు. ఈ పదవికి సాధారణంగా భారతదేశ మాజీ ప్రధాన న్యాయమూర్తి లేదా సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తిని నియమిస్తారు. వీరి పేర్లను కమిటీ రాష్ట్రపతికి సిఫార్సు చేయాల్సి ఉంటుంది. జస్టిస్ మిశ్రా పదవీ విరమణ చేసిన తర్వాత ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి సయానీ తాత్కాలిక ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. 2022 నవంబర్‌లో భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ డి.వై చంద్రచూడ్ ఎన్నో ముఖ్యమైన కేసుల్లో చరిత్రాత్మక తీర్పులు వెలువరించారు. సీజేఐగా ఆయన పదవీకాలం ముగిసిన అనంతరం.. ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతలు స్వీకరించారు.

# మందిర్-మసీద్ వివాదాలు సరికాదు

**పుణె, డిసెంబర్ 20(నినాదం న్యూస్):** ఇటీవల కాలంలో మందిర్-మసీద్ వివాదాలు గణనీయంగా పెరగడం ఆందోళనకరమని రాష్ట్రీయ స్వయంసేవక్ అధినేత మోహన్ భాగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. అయోధ్య రామమందిర నిర్మాణం తర్వాత ఇలాంటి వివాదాలను రాజేసి తాము కూడా హిందూ నాయకులం కావచ్చని కొందరు వ్యక్తులు భావిస్తున్నారన్నారు. ఇది తమకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని వెల్లడించారు. పుణెలో 'ఇండియా-ది విశ్వగురు' అనే అంశంపై సహజీవన్ వ్యాఖ్యానాల కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కలుపుగోలు సమాజాన్ని ఆయన సమర్థించారు. మన దేశం సామరస్యంగా ఉంటుందని ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉందని భాగవత్ పేర్కొన్నారు. తాము హిందువులం కాబట్టే రామకృష్ణ మిషన్‌లో కూడా క్రిస్మస్ వేడుకలు చేసుకొంటామని పేర్కొన్నారు. మనం చాలాకాలంగా సామరస్యంగా ఉంటున్నామని.. దీనిని మనం ప్రపంచానికి అందించాలనుకొంటే.. ఓ ఉదాహ రణగా నిలవాలన్నారు. 'ప్రతిరోజూ కొత్త వివాదం తీసుకొస్తున్నారు. వీటిని ఎలా అంగీకరించ మంటారు. ఇది కొనసాగకూడదు. కలిసిమెలిసి ఎలా ఉంటామో భారత్ చూపించాలి. ప్రస్తుతం దేశం రాజ్యాంగం ప్రకారం నడుస్తోంది. దీనిలో ప్రభుత్వాన్ని నడిపే ప్రజాప్రతినిధులను వారే ఎన్నుకొంటారు. ఎవరో ఒకరి ఆధిపత్యం చేసే రోజులు ఎప్పుడో పోయాయి. ప్రతిఒక్కరూ తమను తాము భారతీయులుగా చెప్పుకొంటున్నప్పుడు ఆధిపత్యం భాష ఎందుకు..? ఎవరు మైనార్టీ..? ఎవరు మెజార్టీ..? ప్రతిఒక్కరూ సమానమే. ఎవరి ఇష్టమైన భగవత్ ఆరాధనను వారు పాటించడమే ఈ దేశ ఆచారం. కాకపోతే నిబంధనలు, చట్టాలకు లోబడి సామరస్యంగా జీవించడం అవసరం' అని భాగవత్ ప్రసంగంలో పేర్కొన్నారు.

## డిమాండ్ల పరిష్కారం దిశగా చర్చలు జరపాలి



**నూతనకల్ డిసెంబర్ 20 (నినాదం న్యూస్):** ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను పూర్తిగా పరిష్కారం చేసేలా చర్చలు జరపాలని 11వ రోజు సూర్యాపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగుతున్న దీక్ష శిబిరం నుండి న్యూస్టుడే కు ఆ సంఘం మండల అధ్యక్షుడు వీరస్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈనాటి కార్యక్రమంలో జానకి రాములు,ఉపేందర్, లింగస్వామి, నవీన్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం

### -ఉత్తర- ఈశాన్య దిశగా వాయుగుండంగా కదిలే అవకాశం

### -రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు



**అమరావతి, డిసెంబర్ 20(నినాదం న్యూస్):** పశ్చిమ మధ్య- ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. రానున్న 12 గంటల్లో ఉత్తరం వైపు కదులుతూ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. తదుపరి 24 గంటల్లో ఉత్తర- ఈశాన్య దిశగా వాయుగుండంగా కదిలే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఉత్తర, కోస్తా జిల్లాలో భారీ వర్షాలు పడతాయని తెలిపారు. రానున్న 24 గంటల్లో ఏపీలోని కాకినాడ, అల్లూరి, అనకాపల్లి, విశాఖ, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు గరిష్ఠంగా 60 కిలోమీటర్లు వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. రానున్న రెండు రోజులుపాటు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. కళింగపట్నం నుంచి మచిలీపట్నం వరకు ఉన్న అన్ని పోర్టులలో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గడిచిన 24 గంటలలో విజయనగరం జిల్లా మెంటాడలో 6 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 'పశ్చిమ మధ్య- ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావం ఉత్తర కోస్తా జిల్లాల్లో ఉంటుంది. ఉత్తర ఆంధ్రలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. తీరం వెంబడి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ చేపల వేటక వెళ్లొద్దని హెచ్చరిస్తున్నామని ఇన్‌ఛార్జ్ డైరెక్టర్, విశాఖ వాతావరణ కేంద్రం శ్రీనివాస్ తెలిపారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్?లో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గ రైతులు తీవ్రంగా నష్టపోయారు. నర్సీపట్నంతో పాటు గొలుగొండ, నాతవరం, రోలుగుంట, కోట ఉరట్ల, మాకవరంపాలెంలో వరి పొలాలు నీటమునిగాయి. వర్షానికి పొలాల్లో కుప్ప పెట్టిన వరి తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇంకా సీఎం సీఎం అంటున్నారు

**-డిప్యూటీ సీఎం అయ్యాను కదా!**
**-నన్ను పనిచేసుకోనివ్వండి**
**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**



**అమరావతి, డిసెంబర్ 20(నినాదం న్యూస్):**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పార్వతీపురం జిల్లాలోని గిరిజిన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బాగుజోల అనే గిరిజన గ్రామంలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అభిమానులు ఓజీ ఓజీ... సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. అయితే, ఆ అభిమానులపై పవన్ చిరు కోపం ప్రదర్శించారు. కొంచెం మందలిస్తున్న ధోరణిలో వ్యాఖ్యానించారు. ఇంతకీ ఆయన ఏమన్నారంటే... "నన్ను పని చేసుకోనివ్వండి. కనీసం రోడ్డు కూడా కనిపించనంతగా నా మీద పడిపోయారు. మీకందరికీ దణ్ణం పెడతాను... రోడ్డు చూడనివ్వండి నన్ను అని చెప్పాల్సి వచ్చింది. ఓజీ ఓజీ ఓజీ అంటూ అరుస్తున్నారు... లేకపోతే, ఇంతకుముందు సీఎం సీఎం అనేవాళ్లు... అదింకా పోలేదు... నేను డిప్యూటీ సీఎం అయినా గానీ వాళ్లకు ఆనందం కలగడంలేదు. అందరికీ నేను చెప్పేది ఒక్కటే... నేను వచ్చినప్పుడు అందరూ నన్ను చుట్టుముడితే పనులు జరగవు. నన్ను పనిచేయనివ్వండి. ఉత్తరాంధ్ర... ప్రజలకు తెలుగు వాడుక భాష నేర్పించిన నేల ఇది, తిరుగుబాటు నేర్పించిన నేల ఇది, ఎవరైనా దోపిడీ చేస్తుంటే ఎదురు తిరిగే నేల ఇది. కానీ ఇవాళ మీరు సినిమాల మోజులో పడి... ఓజీ ఓజీ అని పోస్టర్లు పెట్టి, జేజేలు కొడితే జీవితంలో ముందుకు వెళ్లలేరు. మాట్లాడితే చాలు... అన్నా మీసం తిప్పు, మీసం తిప్పు అంటారు. నేను మీసం తిప్పితే రోడ్ల నిర్మాణం జరుగుతుందా? నేను ఛాతీ గుద్దుకుంటే రోడ్లు పడతాయా?... నేను వెళ్లి ప్రధానమంత్రి గారికి దణ్ణం పెట్టి, సమస్యను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళితే రోడ్లు పడతాయి. అందుకే, మీసాలు తిప్పడాలు, ఛాతీలు కొట్టుకోవడాలు నాకు చేతకావు... నాకు పనిచేయడమే తెలుసు" అంటూ పవన్ కల్యాణ్ అభిమానులకు హితోపదేశం చేశారు. గిరిజన గ్రామంలోని పరిస్థితులు చూసి పవన్ కల్యాణ్ చలించిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాగుజోల గ్రామం నుంచి సిరివర వరకు రూ.9.50 కోట్లతో 9 కిలోమీటర్ల మేర తారు రోడ్డుగా మార్చుతున్నామని తెలిపారు. గతంలో తాను పోరాట యాత్రలో భాగంగా పాడేరు, అరకు వంటి గిరిజన ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ప్రధానంగా మూడు సమస్యలను గుర్తించానని... అవి రోడ్లు, తాగునీరు, యువతకు ఉపాధి అని వివరించారు. ఇక్కడికి రావాలని, ఇక్కడ రోడ్లు వేయాలని ఇప్పటిదాకా ఎవరూ ఆలోచించలేదని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం 2020-22 మధ్య వెనుకబడిన జిల్లాల కోసం రూ.670 కోట్లు ఇచ్చింది. ఆ నిధులు వస్తే, గత ప్రభుత్వం హయాంలో లెక్కా పత్రం లేకుండా చేశారు. తనకు అన్యాయం జరిగిందని చెప్పిన బిడ్డ మీ దగ్గర ఓట్లు వేయించుకున్నారు కానీ... గత ఐదేళ్ల పాలనలో మీకు రోడ్డు వేయలేకపోయారు. రుషికొండ ప్యాలెస్ కు రూ.500 కోట్లు ఖర్చు చేశారు కానీ... గిరిజన ప్రాంతం బాగుజోలలో ఒక రోడ్డు వేయలేకపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని ఒకటే అడిగాను... 70 ఏళ్లుగా ఇక్కడ రోడ్లు లేవు, బాలింతలను డోలీల్లో మోసుకెళ్లే పరిస్థితి ఉందని ఆయనకు వివరించాను. చంద్రబాబు గారి ఆధ్వర్యంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వం తరఫున మీ అందరికీ మాటిస్తున్నాను... మీకోసం ఎండనకా, వాననకా అహర్నిశలు కష్టపడడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.....

# ఆకస్మిక తనిఖీలు చేస్తా..

**-బియ్యం అక్రమ రవాణాను అరికడతాం**
**-బియ్యం స్మగ్లింగ్, రీసైక్లింగ్ పై కఠినంగా ఉంటాం**
**-త్వరలో రైతులకు అందుబాటులోకి సైలోస్ సిస్టమ్**
**-ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి**



**అమరావతి, డిసెంబర్ 20(నినాదం న్యూస్):** ఏపీ సీఎం చంద్రబాబుకృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం గంగూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తర్వాత, రైతులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తులో ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తానని వెల్లడించారు. "గోనె సంచులు ఎక్కడ నుంచి వెళ్లాయో అనే దానిపై కచ్చితంగా ఉంటాం. బియ్యం అక్రమ రవాణాను అరికడతాం. బియ్యం స్మగ్లింగ్, రీసైక్లింగ్ విషయంలో కఠినంగా ఉంటాం" అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. రైతులు ఏ మిల్లులో ధాన్యం అమ్ముకోవాలనుకుంటే ఆ రైస్ మిల్లులో అమ్ముకోవచ్చని, రైతు అనుకూలతను బట్టి తనే ఎంచుకునే సదుపాయం కల్పిస్తామని చెప్పారు. దళారీ వ్యవస్థపై కచ్చితమైన చర్యలుంటాయని, దళారీ వ్యవస్థ ఉండేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. త్వరలో సైలోస్ సిస్టమ్ కూడా రైతులకు అందుబాటులోకి తీసుకుని రావాలని చూస్తున్నాము. సైలోస్ సిస్టమ్ అందుబాటులోకి వస్తే రైతులు కావాల్సిన సమయంలో పంటను అమ్ముకునే అవకాశం ఉంటుంది. దీంతో నిల్వ పెట్టిన ధాన్యానికి ఎక్కువ రేటు వస్తుంది. ఎంటీయూ 1262 గత ఏడాది కృష్ణా జిల్లాలో 3,582 మెట్రిక్ టన్నులు దిగుబడి ఇస్తే.. ఈ ఏడాది 32,859 మెట్రిక్ టన్నులు దిగుబడిని ఇచ్చింది. ఇతర జిల్లాల్లోనూ ఈ పంట దిగుబడి ఎక్కువగా ఉంది... అని చంద్రబాబు వివరించారు. రైతుల ఖర్చు తగ్గించాలి, ఆదాయం పెంచాలి అనేదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏ సీజన్ లో, ఎలాంటి పరిస్థితుల్లో ఎలాంటి పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో రైతులకు వివరిస్తామని అన్నారు. ముఖ్యంగా, పంట చేతికొచ్చాక మార్కెటింగ్ ఎలా చేసుకోవాలో రైతులకు అవగాహన కలిగిస్తామని చెప్పారు. ధాన్యానికి సంబంధించి తేమ శాతం, ఇతరత్రా అంశాల్లో కచ్చితత్వం ఉండడం అవసరమని చంద్రబాబు స్పష్టం చేశారు. గోనె సంచుల పంపిణీలో రైస్ మిల్లులు పొరపాట్లు చేస్తున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, 5 కోట్ల గోనె సంచులు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గతంలో మార్కెట్ కమిటీల్లో డ్రైయర్లు ఏర్పాటు చేశామని, తేమ ఎక్కువగా ఉన్న చోట్ల డ్రైయర్లు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. 1,713 రైస్ మిల్లులకు గాను 394 మిల్లుల్లో మాత్రమే డ్రైయర్లు ఉన్నాయని వివరించారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు రైతుకు అవకాశం ఉండాలని భావిస్తున్నామని తెలిపారు. హార్వెస్టర్ యంత్రాలు వచ్చాక రైతులు సంతోషంగా ఉన్నారని, ఎక్కువ దిగుబడికి కారణాలేంటి అనే అంశాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇటీవల డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ ఎక్కువవుతోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా అధికారులు పర్యవేక్షిస్తుండాలని సూచించారు.గతేడాది కంటే ఈ ఏడాది, ఈ సమయానికి 40 శాతం ఎక్కువగా ధాన్యం కొనుగోళ్లు జరిగాయని చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే 3.20 లక్షల మంది రైతుల నుంచి 21.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రైతులకు 48 గంటల కంటే ముందే ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు.

# దేశ ప్రజలకి అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలి - సిపిఎం



**మంగపేట, డిసెంబర్ 20 ( నినాదం న్యూస్ ) :** దేశ ప్రజలకి అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని సిపిఎం పార్టీ మంగపేట మండల కార్యదర్శి జాగటి చిన్న, మండల సీనియర్ నాయకులు నర్రా శివ ప్రసాద్ లు డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగపేట మండల కేంద్రంలోని తెలంగాణ సెంటర్లో శుక్రవారం నిరసన్ కార్యక్రమం నిర్వహించారు. అమిత్ షా ను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జాగటి చిన్న, మండల సీనియర్ నాయకులు నర్రా శివ ప్రసాద్ లు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కుల మతాల మధ్య చిచ్చు పెడుతూ భవిష్యత్తు దేశ రాజకీయాలని పెను ప్రమాదంలో పెట్టబోతున్నారని, గత వ్యాఖ్యలే దానికి నిదర్శనం అని అన్నారు. పార్లమెంటు సమావేశంలో అంత దారుణంగా హేళనాభరితంగా అంబేద్కర్ అంబేద్కర్ అంటున్నారు దేవుని తలుచుకుంటే స్వర్గపుదారులుంటాయనడం వెనుక ఆర్ఎస్ఎస్ మత చిచ్చు ఇప్పటికే మొదలైందనిఅన్నారు. అమిత్ షా దేశ ప్రజలందరికీ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని, వెంటనే మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేవుని కొలిచే వెనుకబడిన కులాలకు కూడా గుడిలోకి రానివ్వకుండా దాడులకు పాల్పడుతున్నారని, వారికి ఏం న్యాయం చేశారో అమీత్ షా చెప్పాలని, మతం పేరిట, కులం పేరిట ఇంకా దాడులకు పాల్పడుతూ ఉంటే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరని సరైన గుణపాఠం చెప్తారని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగానుసారంగా కేంద్ర హోంశాఖ మంత్రి అయిన అమీత్ షా ఆ విషయం తెలియకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎల్పీ.ముత్యాలు, జాన శేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ చీర కట్టుకు ఐదు వేల ఏండ్ల చరిత్ర

అనాదిగా భారత ఉపఖండ సాంస్కృతిక వారసత్వానికి, నేతన్నల హస్తకళా నైపుణ్య వికాసానికి పెట్టింది పేరు మహిళలు ధరించే సప్తవర్ణాల చీర. ఎలాంటి కుట్లు లేకుండా పొడవైన పలు అద్భుత డిజైన్లతో చీరను మహిళలు నడుం చుట్టు ధరించి, కొంగును భుజాన వేసుకొని చక్కటి సింగులతో కాళ్ల వరకు వేలాడే విధంగా బొడ్లో చెక్కుకుని, శరీరానికి హత్తుకునే విధంగా జాకెట్ ధరించి మహిళల అందాలను ద్విగుణీకృతం చేసే చీర మన భారతీయతకు మరుపురాని చిహ్నం. చీర కట్టు, నుదుటిన బొట్టు, కళ్లకు కాటుకతో భారతీయత ఉట్టిపడే సనాతన సాంప్రదాయం మన స్త్రీ సమాజానికే వన్నె తెచ్చి పెడుతున్నది.

వందల నుంచి లక్షల వరకు ధరలు పలికే చీరలు:

నేడు మార్కెట్లో రెండు, మూడు వందల రూపాయల విలువ చేసే కాటన్ చీరల నుంచి మొదలుకొని, లక్షల విలువ కలిగిన పట్టు చీరల వరకు పలు రకాలైన, ఆకర్షణీయ డిజైన్లతో చీరలు మహిళల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. భారతీయ వివాహ, ఇతర శుభకార్యాల్లో మహిళలు, బాలికలు అందమైన, ఆకర్షణీయమైన చీరలను ధరించి ఆ శుభ వేడుకలకు ఆనంద రంగులను అద్దడం చూస్తున్నాం. ఇద్దరు మహిళలు కలిస్తే తప్పనిసరిగా చీరల ప్రస్తావనలు రాక మానవనేది కఠిన వాస్తవం.

చీర కట్టు పరిణామ క్రమం:

ఇండస్ వ్యాలీ సంస్కృతిగా క్రీస్తుకు పూర్వం 2,800 – 1,800 కాలంలో ప్రారంభంపైన చీర కట్టు నేటికీ అంతే ఆదరణను కలిగి ఉంటున్నది. నవ్య చీరల రూపం క్రీ పూ 300ల్లో రావటం, క్రీ శ 1200ల్లో చీరలు నేసే పరిశ్రమలు ఏర్పడడం, బ్రిటీష్ పాలన సమయంలో 1600–1940ల్లో చీరలకు ఆధునిక రూపం ఇవ్వడం, 1950ల్లో సినిమాల ద్వారా చీర కట్టు ప్రచారం కావడం, 2015 నుంచి ప్రపంచ చీరల దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతోంది. మహిళలు చీరలను దాదాపు 80 రకాలుగా ధరించడం గమనిస్తున్నాం. నేడు ఇండియాతో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ లాంటి దేశాల్లో చీరలను ధరించడం మన మహిళలకు అలవాటుగా మారింది.

చీరలు పలు రకాలు:

చీర కట్టులో మహిళలు అందంగా కనిపించడం, చీరలు స్త్రీ సమాజ చిహ్నాలుగా మారడం గమనిస్తున్న ప్రపంచ మానవాళి ప్రతి ఏట 21 డిసెంబర్‌న "ప్రపంచ చీరల దినోత్సవం (వరల్డ్ సారి డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. ఆధునిక డిజిటల్ యుగంలో చక్కటి అంచుల రంగులు/డిజైన్‌లో తో ఆర్గాంజా చీరలు, బోల్డ్ నియాన్ చీరలు, బెనారస్ చీరలు, బార్డర్‌లెస్ చీరలు, టిష్యూ చీరలు, పస్టెల్ సెక్విన్ చీరలు, 3డి బొమ్మలు కలిగిన చీరలు, టస్సెల్ చీరలు, ఇక్కత్ చీరలు, చందేరీ చీరలు, పైథాన్ చీరలు, పటోలా చీరలు, భుజ్ బంధనీ చీరలు, మెటాలిక్ చీరలు, జిమ్మీ ఛూ చీరలు, వెల్వెట్ చీరలు లాంటి డిజైనర్ సారీస్‌ను మహిళలు మక్కువతో ధరించడం చూస్తున్నాం.

భారత చీరల రాజధాని:

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు వివిధ సందర్భాల్లో భారతీయ చీరల గొప్పదనాన్ని చాటడానికి విలక్షణ రీతుల్లో ఫాషన్ పరెడ్లు నిర్వహించడం, వాటికి మహిళల విశేష ఆదరణ లభించడం చూస్తున్నాం. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణ భారతంలో పలు రకాల చీరల నేతలు/ఉత్పత్తి జరుగుతున్నది. తమిళ నాడులోని "కాంచీపురం" పట్టణం "భారతీయ చీరల రాజధాని"గానే కాకుండా 'సిటీ ఆఫ్ సిల్క్స్"గా కూడా పేరుగాంచి మహిళల అభిరుచులకు అనుగుణంగా సిల్క్ చీరలను తయారు చేసే కేంద్రంగా భాసిల్లుతున్నది.

తెలుగు రాష్ట్రాల్లో ఆదరణ పొందిన చీరలు:

ఏపీలోని వెంకటగిరి పట్టణం చేనేత వస్త్ర నైపుణ్యాలకు వెంకటగిరి సిల్క్ చీరలు ప్రసిద్ధి చెందినవి. అదే విధంగా తెలుగు రాష్ట్రాల మహిళల మన్ననలు పొందిన చీరల్లో ఉప్పాడ పట్టు, పోచంపల్లి, గద్వాల్, కంచి కలంకారి, ఇక్కత్, ధర్మవం, హాండ్ ప్రింట్, మైసూర్ సిల్క్, చెట్టినాడ్, కసవు, మంగళగిరి, కంచీవరం లాంటి అనేక రకాలు ఉన్నాయి.

ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా "ఆర్థికాభివృద్ధి, జీవనోపాధి, సాంస్కృతిక పరిరక్షణ"లో భాగంగా మన వస్త్రాలంకరణల సంరక్షణకు పెద్ద పీట వేయడం జరిగింది. అందమైన, ఆకర్షణీయమైన డిజైన్లతో చీరల ఉత్పత్తులు కొత్త పుంతలు తొక్కడానికి కారణమైన నేతన్నల హస్తకళా నైపుణ్యాలను ప్రశంసిస్తూ, చీర కట్టు ఆచారాన్ని కొనసాగిస్తూ, మహిళలు/బాలికలు మనదైన చీర కట్టుకు పట్టం కట్టి తమ సౌందర్యాలను పలు రెట్లు పెంచుకోవాలని కోరుకుందాం, గౌరవానికి ప్రతీకలుగా చీర కట్టును ప్రోత్సహిద్దాం.

**– డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037**

# 19వ సారి రక్తదానం చేసిన రియల్ పోలీస్




**మల్లాపూర్, డిసెంబర్ 20 (నినాదం న్యూస్):** రక్త దానం ప్రాణ దానం లాంటిది. జగిత్యాల జిల్లా పెంబట్ల గ్రామానికి చెందిన మల్లవ్వ కు కాలు సర్జరీ కొరకు జగిత్యాల నరహరి హాస్పిటల్ అత్యవసర పరిస్థితుల్లో బి పాజిటివ్ రక్తం ఎక్కించాల్సి వచ్చింది. రక్తదానం చేసిన రియల్ హీరో పోలీస్. ఈ విషయం పేషెంట్ బంధువులు రక్తదాతలు అనుసంధాన కర్త తిరుపతి బ్లడ్ ఫౌండేషన్ స్థాపకుడు మారంపెల్లి తిరుపతి దృష్టికి తేవడం తో వెంటనే స్పందించి పోలీస్ సుమన్ 19 వ రక్తదాన ముందుకు వచ్చారని తెలిపారు. భారతి బ్లడ్ బ్యాంకు కి వెళ్లి రక్త ధనం చేసి ప్రాణ దాత గా నిలిచాడు. సమయానికి రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అలాంటి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేస్తే మానవత్వమే మీకు పాదాభివందనం చేస్తుందని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించి రక్త ధనం చేసిన సుమన్ కు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, తిరుపతి రెడ్డి బ్లడ్ ఫౌండేషన్ తరపున హృదయ పూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు.

# ఆశ్రమ స్కూల్‌లో హెల్త్ క్యాంపు




**మంగపేట, డిసెంబర్ 20 ( నినాదం న్యూస్ ) :** మండలంలోని చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చుంచుపల్లి ఆశ్రమ స్కూల్ గర్ల్స్ హాస్టల్ లో చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిన్నపాక యమున ఆధ్వర్యంలో శుక్రవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల గురించి, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత గురించి ఆహారం తినే ముందు, తిన్న తర్వాత చేతులను పరిశుభ్రంగా కడుకోవాలని స్టూడెంట్స్ కు వివరించారు. చలికాలంలో ఎక్కువగా జలుబు, దగ్గు రాకుండా ఉండడానికి కాచి చల్లార్చిన నీటిని తాగించాలని, ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే హాస్పిటల్ కి వెంటనే తీసుకురావాలని హాస్టల్ వార్డెన్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిన్నపాక యమున, పీహెచ్ఎన్ శైలజ , హెచ్.వీ పద్మ, ఆశా కార్యకర్తలు నాగమణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరగాలి

త్రిపురవరంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



**కోదాడ/అనంతగిరి, డిసెంబర్ 20 (నినాదం న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేయించేలా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య శాఖ అధికారి కోటాచలం వైద్యులను, వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం అనంతగిరి మండలంలోని త్రిపురవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా పలు రికార్డును ఆయన పరిశీలించారు. ఆరోగ్యంగా ఉండాలంటే మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాతృ శిశు సంరక్షణ ప్రథమ బాధ్యతగా పనిచేయాలని కోరారు పిల్లలకు సకాలంలో టీకాలు అందించడం ద్వారా తల్లిదండ్రుల బాధ్యతని ఆశా కార్యకర్తలకు ఈ విషయంలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రసన్న, కేజియా సుదర్శన్ ,గంగ ,మహేష్, శైలజ, విజయ్, కృష్ణమూర్తి మంజుల తదితరులు పాల్గొన్నారు.

# రవాణా రంగం నుంచే 40 శాతం వాయు కాలుష్యం

**- వచ్చే ఐదేళ్లలో ఈవీ రంగం వేగంగా అభివృద్ధి - 2030 నాటికి రూ.20 లక్షల కోట్ల స్థాయికి..**

**- ఉద్యోగాల కల్పన కూడా ఎన్నో రెట్లు పెరుగుతుంది - భారత్‌లో ప్రారంభ దశలోనే ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు**

**- వాహన విక్రయాలలో సింగిల్ డిజిట్ మార్కెట్ వాటాలు - కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి గడ్కరీ వెల్లడి**

**న్యూఢిల్లీ :** భారత్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ) రంగం వచ్చే ఐదేళ్లలో వేగంగా అభివృద్ధి చెందుతుందని, 2030 నాటికి రూ.20 లక్షల కోట్ల స్థాయికి చేరే అవకాశం ఉందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ గురువారం (డిసెంబరు 19) వెల్లడించారు. ఉద్యోగాల కల్పన కూడా ఎన్నో రెట్లు పెరుగుతుందని అంచనా వేశారు. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు ఇప్పటికీ ప్రారంభ దశలోనే ఉన్నాయి. మొత్తం వాహన విక్రయాలలో సింగిల్ డిజిట్ మార్కెట్ వాటాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ డిసెంబర్ మధ్య 18 లక్షలకు పైగా రిజిస్టర్ అయినట్లు తెలిపారు. ఇది మొత్తం వాహనాల అమ్మకాలలో 10 శాతం కంటే చాలా తక్కువ. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు ఇప్పటికీ ప్రారంభ దశలోనే ఉన్నాయి, మొత్తం వాహన విక్రయాలలో సింగిల్ డిజిట్ మార్కెట్ వాటాతో ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మరియు డిసెంబర్ మధ్య 18 లక్షలకు పైగాలు రిజిస్టర్ అయ్యాయి, విభాగాల్లో మొత్తం వాహనాల అమ్మకాలలో 10 శాతం కంటే తక్కువ. కానీ 2030 నాటికి పరిస్థితి పూర్తిగా మారుతుందని మంత్రి అన్నారు. ఈవీ పర్యావరణ వ్యవస్థలో సుమారు 5 కోట్ల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేశారు. ప్రస్తుతం రూ.4.50 లక్షల కోట్లుగా ఉన్న మార్కెట్ ఐదు రెట్టు పెరిగి 2023 నాటికి రూ.20 లక్షల కోట్ల మార్కెట్‌కు చేరుకుంటుందని, భవిష్యత్తులో భారత్ గ్లోబల్ ఈవీ హబ్‌గా మారాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు



తెలిపారు. ఈవీల ఫైనాన్స్ మార్కెట్ పరిమాణం కూడా రూ.4 లక్షల కోట్లకు చేరొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం '8వ క్యాటలిస్ట్ కాన్ఫరెన్స్ ఆన్ సస్టెయినబిలిటీ ఆఫ్ ఈవీ వెహికల్ ఇండస్ట్రీ- ఈవీఎక్స్‌పో 2024' సమావేశంలో మంత్రి ఈ మేరకు వెల్లడించారు. రవాణా రంగం నుంచే 40 శాతం వాయు కాలుష్యం నమోదవుతోందని, అలాగే శిలాజ ఇంధనాల దిగుమతులు రూ.22 లక్షల కోట్ల స్థాయికి చేరినట్లు తెలిపారు. ఇది అతి పెద్ద ఆర్థిక సవాలుగా ఇది మారిందని వివరించారు. అందువల్లనే కేంద్ర ప్రభుత్వం హరిత ఇంధనంపై అధికంగా దృష్టి సారిస్తోందని, మొత్తం విద్యుత్‌లో 44 శాతం సౌర విద్యుత్ ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. జల విద్యుత్, సౌర విద్యుత్, హరిత విద్యుత్ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

### హరియాణా మాజీ సీఎం

# ఓం ప్రకాశ్ చౌతాలా కన్నుమూత

**– తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ**

**హరియాణా:** ఇండియన్ నేషనల్ లోక్ దళ్ అధ్యక్షుడు, హరియాణా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా (89) శుక్రవారం కన్నుమూశారు. గురువారం రాత్రి ఆయనకు గుండె పోటురాగా, ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ ఆయనను వైద్యులు రక్షించలేకపోయారని పార్టీ అధికార ప్రతినిధి తెలిపారు.మాజీ ఉపప్రధాని దేవీలాల్ కుమారుడైన ఓం ప్రకాశ్ చౌతాలా హరియాణాకు ఐదు సార్లు (1989 నుంచి 2005 వరకు) ముఖ్యమంత్రిగా పనిచేశారు. హరియాణా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. "చౌతాలా చాలా ఏళ్లుగా రాష్ట్ర రాజకీయాల్లో చురుగ్గా పని చేశారు. తన తండ్రి దేవీ లాల్ పనులను మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం కృషి చేశారు" అని ఎక్స్ వేదికగా మోదీ ట్వీట్ చేశారు. ఓం ప్రకాశ్ చౌతాలా మృతిపై హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ట్వీట్ చేశారు. 'చౌతాలా మరణం చాలా బాధాకరం. ఆయనకు నా నివాళులు. ఆయన తన జీవింతాంతం రాష్ట్రానికి, సమాజానికి సేవ చేశారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు' అన్నారు. ఓం ప్రకాశ్ చౌతాలా మృతి పట్ల హరియాణా మాజీ సీఎం, కాంగ్రెస్ నేత భూపేంద్ర సింగ్ హుడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "ఓం ప్రకాశ్ చౌతాలా సీఎంగా ఉన్నప్పుడు నేను లోక్‌సభ సభ్యునిగా ఉన్నాను. మా మధ్య మంచి స్నేహ సంబంధం ఉండేది. చౌతాలా ప్రజలకు ఎంతో సేవ చేశారు. ఆయన ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండేవారు.

ఆయన ఇంత తొందరగా మనల్ని విడిచి వెళ్లిపోతారని నేను ఊహించలేదు. ఆయన చాలా మంచి వ్యక్తి, నాకు పెద్దన్నయ్య లాంటివారు" అని అన్నారు. ఓం ప్రకాశ్ చౌతాలా మరణవార్త చాలా బాధాకరం. ఆయన హరియాణాకు, దేశానికి ఎంతో సేవ చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు.

## ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా నోడల్ ఆఫీసర్ సాయి శ్రీధర్




**నర్సంపేట డిసెంబర్ 20 (నినాదం న్యూస్ ) :** నర్సంపేట పట్టణం లోని ఎస్ ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ను జిల్లా నోడల్ అధికారి సాయి శ్రీధర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 3 వ తేదీ నుండి 22 వరకు జరిగే ప్రాక్టికల్ ఎగ్జామ్స్ నుండి ఎలాంటి అవకతవకలు జరగకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రాక్టికల్ ల్యాబ్స్ ను క్లాస్ రూమ్స్ ను తనిఖీ చేశారు. ప్రాక్టీల్ ఎగ్జామ్స్ కు సరిపడ ల్యాబ్ పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రాక్టికల్ ఎగ్జామ్స్ కి అందరూ విధ్యార్థులు ఇప్పటి నుండే ప్రిపేర్ కావాలని సక్రమంగా రికార్డ్స్ రాయాలన్నారు. రికార్డ్స్ లేకుండా ఎగ్జామ్స్ కి అనుమతించడం జరగదన్నారు. ఎవరైతే ప్రాక్టికల్స్ కు హాజరు కారో వాళ్ళ ప్రాక్టికల్స్ లలో ఫెయిల్ అయినట్లేనని ప్రతి విద్యార్థి ప్రాక్టికల్స్ మంచిగా చేసి మంచి మార్కులు సాధిస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈసందర్భంగా లెక్చరర్స్ తో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాక్టికల్స్ లలో మంచి మార్కులు సాధించేలా ప్రిపేర్ చెయ్యాలని ప్రాక్టికల్స్ విద్యార్థులకు అందరూ విధ్యార్థులు హాజరు అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల ఛైర్మెన్ అండ్ ప్రిన్సిపాల్ కొయ్యడి సనత్ కుమార్ కళాశాల డైరెక్టర్ కొయ్యడి శిరీష వైస్ ప్రిన్సిపాల్ అజ్మీరా సూరయ్య లెక్చరర్స్ పాలడుగుల సంతోష్ లయన్ ప్రవీణ్ నూనవత్ రమేష బోడ వెంకన్న నునావత్ రమేష్ వరంగంటి సందీప్ శ్వేత శాతరాసి కుమార్ బాదావత్ దేవ్ సింగ్ జరుపుల సునీత తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శనీయం...

### -ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్



**కోదాడ, డిసెంబర్ 20 (నినాదం న్యూస్):**
ఏసుక్రీస్తు జననం ఈ లోకానికి సమాధానంగా నిలిచిందని సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన్ గౌడ్ అన్నారు.కోదాడ పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని బాలురు ఉన్నత పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పడిశాల రఘు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంజన్ గౌడ్ హాజరై, క్రిస్మస్ కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు ఈసందర్భంగా మాట్లాడుతూ....అన్ని మతాల సారం ఒకటేనని.. మత విద్వేషాలు విడనాడి తోటి వారితో సోదర భావంతో మెలుగుతూ.. క్రీస్తు మార్గంలో పయనించాలి... తోటి వారికి తోడ్పాటు అందించడమే క్రీస్తు బోధనల సారాంశం అన్నారు. క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. క్రైస్తవం అనేది ఒక మతం కాదు.. అదొక జీవన విధానం.. క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. నిరుపేదలకు ఎల్లప్పుడూ తమ వంతు సహాయ,సహకారాలు అందిస్తామన్న వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఐ పాస్టర్ రేవా యన్. పాల్, ముస్లిం మతపెద్ద హమిద్ మౌలానా జర్నలిస్టులు గాంధీ, పూర్ణ, వెంకటనారాయణ, లక్ష్మణ్, నాగరాజు, మైముద్, నజీర్,నరేష్, వీరబాబు, రామకృష్ణ, రహీం, శ్రీహరి, పవన్, భాస్కర్, సైదులు, నాగేంద్రబాబు రామకృష్ణ నాయకులు పంది తిరపయ్య శ్రీకాంత్, రహీం, నజీర్, తదితరులు పాల్గొన్నారు.